# పెద్దాపురపు యోజనగంధి

[చిన్న కథ]

'ఆమె ప్రౌఢ ఐనా పసివానిని ప్రేమించింది. ఆపసివాడు పరువంగల యౌవనుడై ఆమెను కామించాడు. తుదకు పునస్సంధానమైంది.'

రచయిత:

కొత్తపల్లి శ్రీరామమూర్తి, యల్.యమ్.ఇ.

వీధితలుపు తట్టేసరికి ముసిముసి నవ్వు నవ్వుకుంటూ వచ్చి యింటి యజమానురాలు తలుపుతీసి 'ఏమండోయ్, సుందర్రావుగారూ! మీప్రక్కగదిలోకి కాపరానికి వచ్చారండోయి' అంది.

మనకి పొరుగుచేరింది, మేడ మెట్లు కాస్త శుభ్రంగా వుంటా యనుకుంటూ ఆగదిలో నివసించ డానికి వచ్చినవ్యక్తి ఎవరో, ఎటు వంటివాడో తెలుసుకుందామన్న ఆతురతకొద్దీ ఒక్క అంగలో మేడ మెట్లు ఎక్కేశాను.

ఆగది మూసేవుంది. ఎవరూ కనుపించలేదు. నాగదితలుపు తీశాను. తీసి లోపల ప్రవేశించేసరికి ఏదో అద్భుతమైన పరిమళం విర జిమ్మినట్టయింది. ఇటువంటి పరి మళద్రవ్యాన్ని ఉపయోగించే వ్యక్తి స్త్రీయే అయివుండా లనుకు న్నాను.

స్త్రీ అని ఎప్పుడు మనస్సునిశ్చ యించానో ఆమె ఎట్లుంటుందో చూదామని తోచింది. కోటుతీసి చిలక్కొయ్యను తగిలించి తలుపు సందులోనుంచి చూశాను. ఏమీ గోచరంకాలేదు.

ఆమె ఏంచేస్తోందో అని చెవు లు నిక్కించి విన్నాను. కాని గది అంతా నిశ్శబ్దంగానేవుంది. ఏవిధ మైన అలికిడీలేదు.

కాని, క్రిందిభాగంలో యింటి యజమానురాలి గొంతు వినప డింది. ఎవరినో 'వున్నారు, రండ'ని ఆహ్వానిస్తోంది. ఆమాట చెవిని బడేసరికి నాస్నేహితులను పేకాటకి రమ్మన్నమాట జ్ఞప్తికివచ్చింది. నేనుకూడా వాళ్ళకు ఎదురు వెళ్లా ను- స్వాగతమియ్యడానికి మేడ మెట్లుదిగి.

మాపక్కగది పరిమళం ము క్కుకి సోకగానే కృష్ణమూర్తి నిశ్చేష్టుడై నిలబడిపోయాడు. అతని ముఖం వాడిపోయింది. శరీరం వణికిపోతోంది. నోటమాట రా లేదు.

ఆస్థితిచూస్తే మాకు భయం వేసింది. 'ఇదేమిరా కృష్ణా' అని రెక్కపట్టుకుని తీసుకొచ్చి అతన్ని పడక్కుర్చీమీద కూచోబెట్టాను.

కొంతసేపటికి కృష్ణుకు కొంత ధైర్యం తెచ్చుకున్నట్టు కనిపిస్తూ జేబురుమాలుతీసి ముఖం ఒక్క సారి నొక్కి తుడుచుకున్నాడు 'ఇదే మిటో చెప్పడం తీరామొదలుపె ట్టాక మీరు ఎక్కిరిస్తే నాహృ దయం వికలమైపోతుంది. ఆఘా తానికి తాళుకోలేను' అన్నాడు, జాలిగా.

'మేమెవ్వరం నవ్వమని' అందరి తరఫునా వాగ్దానంచేశాను.

కృష్ణమూర్తి గొంతు సవరించు కొని తనగాథచెప్పబోయాడు. కాని ముక్క పెగలలేదు. కంగారుపడి వూరుకున్నాడు. కొంచెంసేపు ఆగి 'ఎక్కడ మొదలుపెట్టాలో నాకు తోచడంలే'దన్నాడు.

'నీ పుట్టుకతో మొదలుపెట్టు' అన్నాను అని ఊతంగా 'ఒకే, నీకు పెద్దాపురందగ్గర పెద్దాపురం రాజులకోట వుంది ఎరుగుదువా? ఆ కోటవున్న కొండకి మూడామడల దూరాన ఏటివడ్డునవున్న ఒక కుగ్రామంలో పుట్టాడు. ఆగ్రామం చుట్టూ పొరంబోకులు విశాలంగా వున్నాయి' అని కథకు ఉపోద్ఘాతం మొదలుపెట్టా అతనికి దారి చూపినట్టుగా.

దానిని అందిపుచ్చుకుని కృష్ణమూర్తి యిట్లా చెప్పసాగాడు.

'దాన్ని కుగ్రామం అనేకన్న పల్లెఅంటే బాగుంటుంది. ఆపల్లె పేరు అధరాపురం. మాఅయ్య రోజూ మాయావారానికి వూరూరా తిరిగేవాడు. దొరికినబియ్యం అర్థో, పావులామో అమ్మకిచ్చేవాడు. ఆమె ఉన్నదాంట్లో క్లుప్తంగా సంసారంగడిపేది. నేను వారికి ఏకైక సంతానం.

రోజూ మాతండ్రిని నన్నుకూడా తీసుకెళ్ళమనేవాణ్ణి. కాని మాతల్లి నన్ను వెయ్యికళ్ళతో చూచుకునేది. నన్ను విడిచిపెట్టి వుండటానికి యిష్టపడేదికాదు.

ఇల్లావుండగా ఒకసారి గణపతి నవరాత్రిళ్లకి పెద్దాపురంలో పెద్ద ఉత్సవాలు జరుగుతున్నాయి. మావూరివాళ్ళందరూపోయి చూచివచ్చి గొప్పగా చెప్పుకునేవారు. ఈసారి తప్పకుండా వెళ్ళాలని నిశ్చయించుకున్నాను. మానాన్నని అడిగా, తీసుకువెళ్ళమని. ఆలాగే నన్నాడు.

అది ఆఖరిరోజు. ఆవేళ ఏనుగుమీద వూరేగింపన్నారు. ఆరోజున నన్ను తీసుకువెడతానన్న మానాన్నగారు పనిమీద పక్కవూరు వెళ్లారు. సాయంకాలం ఆరుగంటలైనా రాలేదు. నాకు కడుపులో ఆరాటం బయలుదేరింది. మాఅమ్మతో చెప్పి వెడదామంటే ఆమె పోనీయదు కాబట్టి చెప్పకుండా ఉడాయించాను. అదే పరుగు. పెద్దాపురం జేరాను.

ఉత్సవం మంచి జోరుగావుంది. భజనలు, భోగంమేళాలు, బుట్టబొమ్మలు బేండుమేళాలు ఒకటేమిటి కన్నులవైకుంఠంగావుంది ఉత్సవం బజారువీధినుంచి భోగంవీధికి మళ్ళింది సానివీధిఅంటే స్వామికికూడా ప్రీతేకాదుమరి. ఆటపాటలు ద్విగుణీకృతోత్సాహంతో విరాజిల్లుతున్నాయి.

ప్రకృతిమాత పులకితగాత్రి ఐ హర్షబిందువులు రాల్చుచున్నదా అన్నట్టు ఆసమయంలో చిన్నచిన్న తుప్పరపడసాగింది.

కుంభవృష్టిగా వర్షంకురిసింది. ఎక్కడివారక్కడ ఎగిరిపోయారు నాకట్టుకున్న లాగు, చొక్కా కొంచెంగా తడిశాయి. కాని ఎక్కడికి పోవడానికి తోచిందికాదు. సమీపాన్నివున్న ఒక అరుగుమీద జేరాను. చలిగాలి విసరసాగింది. చలికి వణకడం ప్రారంభించాను. ఇంతలో ఆయింటినుంచి ఒక యువతి తొంగిచూచింది. అప్పుడు అపూర్వమైన సువాసన గుప్పుమంది.

ఆమె నాదీనస్థితిచూచి జాలిపడింది కాబోలు. లోపలికిరా అబ్బాయి అంది.

ఆమాటలో మాధుర్యముంది. బయటనున్న యీదరగాలికి తాళలేక లోపలికివెళ్లాను ఎవరిఅబ్బాయివి నాయనా అంది. నాకు నోటమాటరాలేదు. ఇంటిదగ్గ చెప్పకుండా వచ్చానన్న భయమూ, ఏమిచెపితే ఏమివస్తుందో అన్న భయమూ రెండూ వేధించాయి.

పరుగెత్తుకువచ్చినందువల్ల ఆకలిమంట కడుపులో దహించుకుపోతోంది.

భయంలేదులే నాయన చెప్పు అని నన్ను దగ్గరగా తీసుకొన్నది' అని కృష్ణమూర్తి ఒక నిట్టూర్పు విడిచాడు.

'అమ్మయ్యో అసలు కథాఘట్టానికి వచ్చా'మన్నాడు శాస్త్రి.

'వూరుకో చెప్పనీయరా పానకంలో పుడకలా మధ్యమధ్యన నీపిల్లసమ్మోరేమిట్రా' అన్నాడు విసుపుతో మోహనరావు.

'నన్ను దగ్గరగా అదుముకున్నప్పుడు నాచొక్కా చల్లగావుందని ఆమె తెలుసుకొని దానిని తీసివేయమంది. తీసివేశాను. నీకు ఆకలిగావుందేమో కొంచెం అన్నం పెడ

నా తింటావా అంది. వాళ్ళు ఎవళ్ళో అన్న సంశయం నామనస్సులో పరుగెత్తింది. తింటే ఏంతప్పో అని వద్దన్నా.

పోనీ కొంచెం ఫలహారంచేయి అని తియ్యబూంది ఒక పింగాణీ పళ్ళెంలో పెట్టి తీసుకొచ్చి బల్లమీద పెట్టింది.

కడుపులో కాముడు గంతులేస్తున్నాడు ఇక గునిస్తే లాభం లేదని ఉపక్రమించాను.

నోటిదగ్గర పెట్టుకున్నాను. అది సామాన్యమైన తీయబూంది కాదు. పూరదేనెలో వేసిన తీయబూంది. దానిమాధుర్యం ఏమని చెప్పను?

బయట వాన వెలిసింది. ఎవరో వచ్చి ఆమెతలుపు తట్టినారు. ఇప్పుడు వీల్లేదు పొండని గదిమింది

నిశరాత్రి అయిందనుకుంటాను. పడుకో నాయనా అంది ఒకమంచం చూపి. అప్పుడు ఎక్కడికీ పోదామన్నా దారిలేకనూ, ఆమె ఆదరణకు ఆనందపరవశుడనైయ్యున్ని ఆమంచంమీద పడుకున్నాను. అది నాకు హంసతూలికాతల్పంలా కనుపించింది. మొహమల్ గుడ్డతో కుట్టిన దిండ్లు చాలా మృదువుగా వున్నాయి.

అలసివుండటంవల్ల చప్పున నిద్ర పట్టిపోయింది. కాని సగంరాత్రి వేళ మెలుకవవచ్చింది. బయట ఉరుములు, మెరుపులు హృదయ విదారకంగావున్నాయి. మాఅమ్మ జ్ఞాపకంవచ్చింది. భయంచేత కెవ్వున కేక పెట్టాను. నా కేకవిని ఏమి నాయనా అంటూవచ్చి నామంచం మీద పడుకుని నన్ను దగ్గరగా అదుముకుని పడుకుంది ఆమె. భయంలేదు పడుకోమంది.

ఆమెస్పర్శ తగలగానే సర్వము మరిచిపోయాను ఏదో ఆనందవాహినిలో యీదులాడీనట్లైంది.

'ఆమె మాంత్రికురాలై వుండాలి', అన్నాడు శాస్త్రి

'మళయాళమంత్రాలు నేర్చుకుందేమో' అన్నాడు వేరొకమిత్రుడు.

నేను ఇవి ఏవీ వినిపించుకోకుండా కథ మళ్ళీ ప్రారంభించాను. 'మరునాడు సూర్యోదయం కాకుండానే లేచింది. పాలుకాచి తెచ్చి నన్ను లేపింది. దంతధావనం చేశాక ఆపాలు పుచ్చుకోమంది. తరువాత బలవంతంమీద నా సంగతి అంతా కనుక్కుంది.

వెర్రిపిల్లాడా అంటూ బండి ఒకటి కట్టించి మావూరు తీసుకువెళ్ళింది మా అమ్మా, నాన్నా నాకై వూరంతా వెదకిస్తున్నారు. నన్ను గుమ్మంలో చూడగానే మాఅమ్మ గబగబావచ్చి ఎక్కడికి పోయావు నాయనా అని కౌగలించుకుంది.

మావాళ్లు ఆమెను కొంచమైనా గౌరవించలేదు సరిగదా ఎవరునీవని అయినా అడగకుండా తలుపులు మూసేసుకున్నారు, కోపంగా చూస్తో, నన్నులోపలకి లాక్కుని మావాళ్లు. నన్నింత ఆప్యాయంగా ఆదరించిన స్త్రీమూర్తికి చేయవలసిన సత్కారమిదా అని నాకు పట్టరానికోపంవచ్చింది.

ఇంటికివచ్చినా నామనస్సు ఆమెనుండి తిరిగి నావశం కాలేదు. సర్వకాల సర్వావస్థలయందు ఆమె స్ఫురణకు వచ్చేది ఆమె ఆదరణ, ఆనువాసన, ఆవిలాసము ఎంతప్రయత్నించినా మరపునకు రాలేదు.

తిరిగి ఆమెనుచూడాలన్న అభిలాష అంకురించింది. రాత్రిళ్లు నిద్ర పట్టేదికాదు. ఆమెకై విలపించేవాణ్ణి. కాని నా విలాపము వినేవారెవరు? నాలో నేను కుళ్ళిపోయేవాణ్ణి.

నాయీ పరధ్యానం కనిపెట్టి కాబోలు మాఅమ్మ నన్నువూరికే కోప్పడేది

ఆమె సరసన మాచేసరికి నన్నంతగా ఆదరించిన ఆ ప్రేమమూర్తి సాన్నిధ్యానికెందుకు పోగూడదనిపించేది. తిరిగి యిల్లువిడిచి పారిపోదామా అనుకునేవాణ్ణి.

ఆలా రెండేళ్లుగడిచాయి. విజృంభించిన ఆభావానికి హృదయముప్పొంగ ఒకనాడు తిరిగి పెద్దాపురం ఉడాయించాను.

కాని ఆయింటితలుపులు బంధింపబడివున్నాయి. నాకు అప్పుడు అశి

నిపాతము ఐనట్టు అయింది. ఎక్కడకిపోయిందో తెలుసుకుందామంటే యింట్లో మరి ఎవరూ లేరు. తాళంవేసివుంది యిల్లు' అంటూ కృష్ణమూర్తి ఒక్క పెద్దనిట్టూర్పు విడిచాడు.

ప్రక్కగది తలుపులు తిరిగి కిరుకిరుమన్నాయి. సువాసన మరల వ్యాపించింది.

ఏమిటదన్నాడు శాస్త్రి.

'ఆమె తిరిగి వచ్చింది అన్నాడు' పద్మనాభరావు.

తిరిగి కృష్ణమూర్తి ముఖం విహ్వలమైపోయింది కత్తివేసినా నెత్తురుచుక్క రాలేటట్టు లేదు.

మళ్ళీ దీనంగా యీలా సాగించాడు కృష్ణమూర్తి.

'నాకు అర్థంకాదావాంఛ. ఎందుకు ఆమెను చూడాలని వుందో తెలియడంలేదు. ఆవాంఛ నాహృదయంలో నిద్రపోతూవుంది. కాని అప్పుడప్పుడు అకస్మాత్తుగా స్ఫురణకువచ్చి హృదయాన్ని బ్రద్దలు కొడుతుంది.

ఆమె విగ్రహం, ఆమె చేష్టలు నాకంటికి కట్టినట్టు కనుపిస్తాయి. ఎప్పటికేనా ఆమె పునర్దర్శనం కలుగుతుందని నా అంతరాత్మ ధైర్యంచెబుతూవుంది. ఆసువాసన తగిలేటప్పటికి ఆమె అందుబాటులోనే వున్నదనుకుంటాను. అదే నన్ను వూపేస్తుంది.

ఆసువాసన రాగానే ఆమె అయివుంటుందనుకుని తలుపుగొట్టి చూదామనుకున్నాను. కాని ధైర్యం లేకపోయింది. శక్తి సన్నగిలిపోయింది. వేరేదారిలేక ఖిన్నుడనై యిక్కడ చతికిలబడ్డాను.

నేను కనుక్కొంస్తానని ధైర్యం చేసి ఆమె తలుపుతట్టాను.

'ఎవరువారని' లోపలనుంచి కోకిలస్వరం వినిపించింది.

'నేనండి' అన్నాను.

'నే నంటే'

'మీప్రక్కగదిలో కాపురము. న్నాను. నేనండి'అన్నాను తిరిగి.

ఆమె తలుపుతీసింది. ఒకమూల టేబిలుమీద టేబిల్‌లాంపు కునుకుతోవుంది.

ఆమె చరచరా అటువెళ్ళి దీపం హెచ్చించింది.

నాకేసి తీక్షణంగా పరిశోధించినట్టు చూసింది.

'మీ దేవూరండి' అన్నాను

'మాది పెద్దాపురం. మీది' అన్నది.

మాదీ అవూరేకాని బాల్యంలోనే ఆవూరు విడిచి వచ్చాను అన్నాను.

'అయితే ఎందుకువచ్చారూ' అంది.

'మీరు మావూరివారని తెలిస్తే చూదామని వచ్చా'నన్నాను.

నన్ను యౌవనంలో చూచిన వారిని ఎవరినీ చూడ్డం నాకిష్టంలేదంది.

ఇట్లాఅంటూ ఆమె కప్పుకున్న శాలువా జారవిడిచింది. మంచం మీద కూచుని నాకోకుర్చీచూపింది కూచోమని.

ఆమెతో మాటలాడుతూ గది నాలుగుమూలలు పరికించాను. ఒకమూల బల్లమీద పెద్ద తేనె సీసా కనుపించింది. ఒకసీసాలో సారపప్పు వున్నది.

రహస్యం భేదించినట్లు లోలోపల సంతసించాను.

'మావాడు మిమ్మలనుగూర్చి చాలా చెప్పా'డన్నాను.

'ఏమని' అంది.

'కరుణార్ద్రహృదయులనీ, చాలాసుందరులనీ, చూచితీరాలనీ అన్నాడు.' అని జంకుతూ చెప్పాను.

'నేనా? ఎవరన్నారు అంటూ' నవ్వసాగింది.

'ఆనాడు బాలుడు, ఈనాడు యువకుడు- లెండి' అన్నాను ఆమె నవ్వువల్ల ధైర్యంతెచ్చుకుని.

'అందాన్నిగురించి పిల్లలకేం తెలుసోయి పిచ్చివాడా? ఎవరుఆదరిస్తే వారే అందమైనవాళ్లుగా కనుపిస్తారు. అవునా?'అంది.

'ఒక కుర్రవాడు మీయందు బద్ధానురాగుడై వున్నాడు. అది మీకు తెలియదేమో?'

'కుర్రవాడా? నన్నా! ప్రేమించాడా. నీవు అసందర్భంగా మాటాడుతున్నట్టుంది' అంటూ పకపకా నవ్వింది.

'మీకు జ్ఞాపకం వుందో లేదో— ఒకనాటిరాత్రి మీకు అతిథి. మీరతనికి తేనెలో వేసిన తీయబూంది పెట్టారుటకూడాను? అతడు మిమ్ము చూడగోరుతున్నాడు.'

ఆమె ఒక్కక్షణం నిశ్చేష్టురాలైంది. కంపితురాలైంది. తిరిగి శాలువ వంటినిండా కప్పుకుంది. నేను మీకు తలుపుతీయడమే తప్పని విసుక్కుంది.

ఆతడు మిమ్ములను చూడకోరుచున్నాడు. ప్రక్కగదిలోవున్నాడు మీరు అవునోకాదో చూచి రమ్మన్నాడు నన్ను అనుమతియిస్తే తీసుకువస్తా.

'ఇదికలా?' అన్నమాటలు ఆమె పెదవులనుండి జారినవి.

'కలకాదు, సత్యమే. అతడుసర్వకాల సర్వావస్థలయందు మిమ్మును గూర్చే కలలు కంటున్నాడుట. మిమ్ములను చూడాలన్న కోరిక. కాని భయం.

'నాకై గాఢమైన వాంఛా? కాని భయమా? ఆహా! ఆరాత్రి తిరిగిరాదుకదా!' అని ఒకనిట్టూర్పు విడిచి. 'అతనిని తిరిగి చూడాలన్న వాంఛ నాకూవుంది. కాని వళ్ళు కంపిస్తోంది భయంగావుంది ఆపాదమస్తకం శరీరం వణికిపోతోంది' అంది.

'ఇద్దరికీ భయంపోతుంది పిలవనా' అన్నాను.

'వద్దు' అని మంచంమీదనుంచి చివాలునలేచింది.

'ఇక్కడ చూడటం నాకిష్టంలేదు. వానిని చూచి సహించలేను. నన్నుచూసి భయపడేవాణ్ణి ఇక్కడ వంటరిగా చూచి లాభమేమిటి? వద్దు ఇక్కడికి పిలవ్వొద్దు' అంది.

'అయితే ఏంచెప్పను వానికి?' అన్నాను.

'నేను ఆనాటి స్త్రీనికానని, నా లావణ్యమంతా దానంచేసేశానని. యౌవనంయిగిరిపోయిందని, యిప్పుడు మిగిలిందంతా స్థూలమైన శరీరంమాత్రమని చెప్పు చాలు' అని ఏడ్వసాగింది. కళ్ళను రెండు చేతులతో మూసుకుంది.

ఆమె విచారం చూడలేక చివాలునలేచి వెళ్ళిపోయాను నా గదికి.

కృష్ణుడు అతురతతో చూశాడు. ఏంజరిగిందన్నాడు. జరగడానికేముంది?

'ముసలి లావుపాటి తొక్కనని' చెప్పమంది.

ఆమాట కతడు చేష్టలుడిగి కొయ్యబొమ్మలా అయిపోయాడు.

అప్పుడు రాత్రి తొమ్మిది గంటలైంది. అతనివాలకం చూచేసరికి మాకు కంగారు పట్టుకుంది.

కాని ఆమె చరచరా మెట్లు దిగి వెళ్ళిపోతోంది. సువాసన ఆమెను వెంటాడిస్తోందా అన్నట్టు గదిలో మామూలుగాలి ప్రవేశించింది.

ఆమె పోవడంచూచి చివాలున లేచి ఏమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు కృష్ణుడు.

ఎక్కడికిపోతున్నాడో అని లేచి కిటికీలోనుంచి చూచాం. ఎదురుగా బస్సుస్టాండువద్ద వారిద్దరు కనుపించారు ఎక్కడనుంచి వచ్చిందో ఒక బస్సువచ్చి ఒక్కక్షణం అక్కడ ఆగి బుర్రుమంది.

మళ్ళీ వాళ్లు కనుపించలేదు.

---

## విజ్ఞానవిషయాలు

బృహస్పతిగ్రహంయొక్క మధ్యరేఖ నిడివి 86,500 మైళ్లు. కాబట్టి గ్రహాలన్నిటిలోకి అది పెద్దది. బుధగ్రహంయొక్క వ్యాసరేఖ నిడివి 3030 మైళ్లు. కాగా అది గ్రహాలన్నిటిలోకి చిన్నది.

... ... ...

మాగెలన్ అనేవాడు 1521-వ సంవత్సరంలో పసిఫిక్ మహాసముద్రానికి ఆ పేరు ఇచ్చాడు.

... ... ...

ఇంగ్లండులోకి పదహారో శతాబ్ది చివరిభాగంలో మొదటిసారి బంగాళాదుంపలు కొనిరాబడ్డాయి.

... ... ...

ఇంగ్లండులో పెన్నీ పోస్టేజి 1840 జనవరి 10-వ తేదీని ప్రవేశపెట్టబడింది.